# మున్సిపల్ నిధులు దుర్వినియోగం : బిజెపి కౌన్సిలర్లు

**నర్సాపూర్, మార్చి 28, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ తీర్మానం లేకుండా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని బిజెపి కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, గోడ రాజెందర్, సంగసాని సురేశ్, ఎరుకలి యాదగిరి, లతరమేశ్‌యాదవ్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ కొందరు అధికారులు నర్సాపూర్ చైర్మన్ కుమ్ముక్కై టియుఎఫ్ఐడిసి నిధులు 30 కోట్ల 95 లక్షల నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధికిగాను మంజూరైనట్లు తెలిపారు. కాగా ఈ నిధులు మున్సిపల్ తీర్మానం లేకుండా కొందరు కౌన్సిలర్‌లకు అధికంగా కేటాయించారని ఆరోపించారు. కాగా బిజెపి కౌన్సిలర్లకు ఈ నిధులు ఇవ్వలేదని వారు చెప్పారు. ఈ మేరకు మున్సిపల్ తీర్మాణం లేకుండా కౌన్సిలర్‌లకు తెలియజేయకుండా ఈ నిధులు దుర్వినియోగం చేశారని వారు ఆరోపించారు. ఈమేరకు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు సైతం వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు. మున్సిపల్‌లోని అందరి కౌన్సిలర్లకు సమానంగా నిధులు కేటాయించాలన్నారు. తమ ఇష్టానుసారంగ వ్యవహరించడం సరికాదని వారు తెలిపారు., ఇప్పటికైనా నిధులు బిజెపి కౌన్సిలర్ల వార్డుల అభివృద్ధికి కేటాయించాలని వారు కోరారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# అవినీతిని చట్టబద్ధం చేసిన కేంద్ర సర్కార్

**-సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**కంది, మార్చి 28, ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని తీసుకువచ్చి ఫ్యూడల్ పద్దతులు ప్రవేశ పెట్టడానికి కృషిచేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కందిలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ అధికారం కొరకు బిజెపి కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు సృష్టిస్తోందని విచారం వ్యక్తం చేశారు. సీఏఏ, పౌరసత్వ చట్టం అమలుకు పూనుకుందని, జ్యోతిష్య శాస్త్రం, వాస్తు వంటివి ప్రవేశపెట్టి విద్య కాషాయీకరణకు యత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈడీ, సిబిఐ సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను వేధించడం, లొంగదీసుకోవడం, ప్రశ్నించే మేధావులను జైల్లో పెట్టడం బిజెపి చేస్తోందని విరుచుకుపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలు పరిష్కరించాలని, భూసమస్యలను పరిష్కారం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నర్సిములు, మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు భరత్ తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసుల వివరాలను తెలుసుకుంటున్న అనురాధ

# ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి

**సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ**

**చేర్యాల, మార్చి 28, ప్రభాతవార్త :** శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ కోరారు. గురువారం చేర్యాల, కొమురవెళ్ళి, మద్దూరు పోలీస్‌స్టేషన్లను జిల్లా పోలీస్ కమిషనర్ సందర్శించి అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధుల విధానాల గురించి వారికి అవగాహన కల్పించారు. మూడుమండలాల్లో క్రిటికల్, నార్మల్ గా ఉన్న పోలింగ్ కేంద్రాల, పోలీస్‌స్టేషన్లలో కేసుల వివరాలను గురించి హుస్నాబాద్ ఏసిపి సతీష్, చేర్యాల సిఐ శ్రీనుతో పాటు మూడు మండలాల ఎస్సైలను సిపి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ అనురాధ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గొడవలను సృష్టించే వ్యక్తులను గుర్తించాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్లను మభ్యపెట్టె వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు.

# అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

**-పాతనేరస్థులను బైండోవర్ చేయాలి**

**-నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్‌పి సూచన**



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి

**జహీరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని గురువారం పట్టణ శివారులోని మహేంద్రా గెస్ట్ హౌజ్‌లో జహీరాబాద్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి రూపేష్ చెన్నూరి మాట్లాడుతూ పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్న గ్రేవ్, నాల్ గ్రేవ్‌కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులను ఇన్వెస్టిగేషన్ చేసే తరుణంలో పాటించాల్సిన పద్దతులపై అధికారులు తగు సూచనలు చేశారరు. బాధితులకు న్యాయం జరిగేలా పరిశోధన చేయాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సిసి కెమెరాలతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో స్వచ్ఛందంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహం కల్పించాలని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారలు, కుల సంఘాల నాయకులు ముందుకు రావాలిసన అవసరం ఉందన్నారు. కేడిలు, సస్పెక్ట్‌ల కదలికలపై ప్రత్యేక నిఘా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని హితువు పలికారు. ప్రజలు ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జహీరాబాద్ డిఎస్‌పి రాంమోహన్‌రెడ్డి, టౌన్ సిఐ రవి, రూరల్ సిఐ నయిమోద్దిన్, ఇసిఆర్పీ ఇన్స్‌పెక్టర్ రమేష్, సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది

**గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్**

**కొండపాక, మార్చి 28, ప్రభాతవార్త :** కొండపాక మండల ఎంపిపి ర్యాగళ్ల సుగుణపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం గురువారం నెగ్గినట్లు గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ తెలిపారు. ఈ నెల 5న 9 మంది ఎంపిటిసిలు కలిసి గజ్వేల్ ఆర్డీవోకు ఎంపిపి ర్యాగళ్ల సుగుణపై అవిశ్వాసం తీర్మాన పత్రాన్ని అందించారు. కాగా అదికారులు బల పరీక్ష నిరూపణకు ఈ నెల 28న సమయం కెటాయించారు. ఈ సందర్భంగా గురువారం కొండపాక ఐకెసి కార్యాలయంలో అర్డిఒ సమక్షంలో 9 మంది ఎంపిటీసి సభ్యులు హాజరై అవిశ్వాస తీర్మాణానికి మద్దతుగా, ఎంపిపి సుగుణకు వ్యతిరేకంగా ఓటు వేసినట్లు అయన తెలిపారు. ఎంపిపి అవిశ్వాస బలపరీక్ష వివరాలను పై అధికారులకు అందిస్తామని, ఎంపిపి ఎన్నికకు సంబంధించిన తేదీని పై అధికారుల ఆదేశాల మేరకు నిర్ణహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కాగా ప్రస్తుతం అవిశ్వాసానికిగురైన ఎంపిపి సుగుణ బిఆర్ఎస్ పార్టీకి చెందని నాయకురాలు. అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టిన వారిలో 7 మంది ఎంపిటీసి సభ్యులు బిఆర్ఎస్‌కు సంబంధించినవారే కావడం గమనించదగ్గ విషయం. ఇందులో కొండపాకకు చెందిన ఇద్దరు అరుట్ల లక్ష్మి, మంచాల అనసూయ, ఎంపిటీసిలు, వెలికట్టకు చెందిన చింతల సాయిబాబా, ఖమ్మంపల్లి పెద్దసాయినిగారి యాదగిరి, దుద్దెడ గ్రామానికి చెందిన గురజాడ బాలాజీ, పిల్లి శిరిష, మర్పడ్గ పత్తి అంజనేయులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎర్రవల్లి ఎంపిటిసి విరుపాక ప్రణవి, బిజెపికి చెందిన సిర్సనగండ్ల ఎంపిటీ నందాల శ్రీనివాస్‌లు బల పరీక్షకు హాజరయ్యారు.



మాట్లాడుతున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

# స్వేచ్ఛగా ప్రజలు ఓటు వినియోగించుకునేలా చూడాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్‌పి రూపేష్**

**సంగారెడ్డి టౌన్, మార్చి 28, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ నియంత్రణ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ, గ్రీవెన్స్ కమిటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్‌పిలు మాట్లాడుతూ ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టిలలో పట్టుబడిన నగదును రశీదు అందించి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందజేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద అన్ని రకాల వాహనాలను తనిఖీ చేయాలన్నారు. సువిధ యాప్‌లో అన్ని అనుమతులుపొందవచ్చని చెప్పారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ఖర్చు రూ. 90 లక్షలకు మించరాదన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించే రోడ్‌షోలు ఫంక్షన్‌లలో భోజనాలు ఖర్చులను ఎఫ్ఎస్‌టి టీములు రికార్డు చేయాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత లైడ్ స్పీకర్ ప్రచారాలు నిలిపివేయాలని ఆదేశించారు. నేషనల్ హైవే 65పై చెకింగ్ పాయింట్స్ వద్ద ప్రాపర్‌గా అన్ని వాహనాలను చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. సీ విజిల్ యాప్ 1950 గురించి ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించి నగదు పట్టుబడితే ఎఫ్ఐఆర్ బుక్‌చేయాలని ఆదేశించారు. ప్రచార వాహనాల అనుమతి పత్రాలను పరిశీలించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే రూమర్స్‌పై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజా రాణి, జడ్పీ సిఈఓ జనకిరెడ్డి, డిఎఫ్ఓ శ్రీధర్, ఎల్‌డిఎం గోపాల్ ఏఆర్ఓలు, ఆర్‌టిఓ, జిల్లాలోని ఆర్డీఓలు, ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులు, నోడల్ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

# సిఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**కొల్చారం, మార్చి 28 ప్రభాతవార్త:** సీఎంఆర్‌ను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కొల్చారంలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లు, శ్రీధర్ ఇండస్ట్రీస్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి రబీ 2022-23 ధాన్యం వెనువెంటనే అప్పగించటానికి వానాకాలం ధాన్యం బియ్యం అప్పగించాలని, టెండర్ పూర్తయిన యాసంగి రబీ 2022-23 వెను వెంటనే అప్పగించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు ఆదర్శనీయంగా ఉండాలని, రబీ 2021-22, ఖరీఫ్ 2021-22 ధాన్యం బియ్యం అప్పగింతలు పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు ఏప్రిల్ 30వ తేదీ లోగా డెలివరీ పూర్తి చేయాలని, అప్పటికి పెండింగ్ ఉన్న మిల్లర్లపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించారు. బియ్యం డెలివరీలో జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ హరికృష్ణ, ప్రణిత, సాదిక్, సత్య సాయి రైస్‌మిల్లు యజమాని శ్రీనివాస్, శ్రీధర్ ఇండస్ట్రీస్ యజమాని ఆశన్నగారి కిష్టయ్య ఉన్నారు.



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్

# ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

**-ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్**

**పెద్దశంకరంపేట, మార్చి 28 ప్రభాతవార్త:** ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, మిషన్ భగీరథ వాటర్‌మెన్‌లకు త్రాగునీటి శాంపిల్స్ సేకరణపై అవగాహన కల్పించారు. ఆయా ట్యాంకుల నుండి మూడు రకాలుగా శాంపిల్స్ సేకరించి రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. క్లోరినేషన్ తప్పకుండా చేపట్టాలని, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయితీలకు క్లోరోసిప్ పరికరాలను అందజేశారు. వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రమేష్, ల్యాబ్ సిబ్బంది రమేష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ కిషన్ తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

**సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను**

**నంగునూర్, మార్చి 28, ప్రభాతవార్త:** ఓటు హక్కును ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం నంగునూర్‌లో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు, రూరల్‌ఎస్ఐలు బాలకృష్ణ, అపూర్వరెడ్డి, కేంద్ర బలగాలు, సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లోక్ ఎన్నికలను ప్రశాంతవంతమైన వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధమన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1950కి సమాచారం అందించాలన్నారు. భారత ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశపెట్టిన సీ-విజిల్ యాప్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు కానీ అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు కానీ ఓటు వేయమని ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన డబ్బుల అశ చూపి ప్రలోభ పెట్టినా..మద్యం డబ్బులు ఓటర్లకు సరఫరా చేసిన ఎలాంటి నేరపూరిత చర్యలకు దిగిన ఎన్నికల సంఘం నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన యాప్ మొబైల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఫోటోలు, వీడియోలుతీసి ఫిర్యాదు చేయాలన్నారు. అల్లర్లు, గొడవలకు పాల్పడిన వెంటనే ప్రజలు, యువకులు స్పందించి సమాచారం అందించాలన్నారు.




నంగునూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

# ప్రారంభమైన తునికి శ్రీనల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు

**-తునికి గ్రామం నుండి బండారు తీసుకురావడం.. ఆలయానికి ప్రత్యేక అలంకరణ, అమ్మవారికి పంచామృతాభిషేకాలు**

**కౌడిపల్లి, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతో పాటు పెద్దఎత్తున జాతర ఉత్సవాలు జరిపి, భక్తులు తమ కోరిన కోరికలు తీర్చిన దేవతలకు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే జిల్లాలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలను గురువారం నాడు ఆలయ ఉత్సవ కమిటి చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప చేతుల మీదుగా అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అంగరంగ వైభవంగా అలంకరించి, ప్రత్యేక పూజలును చైర్మెన్ తోపాటు ఆలయ ఉత్సవ పాలక వర్గ సభ్యులు, ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ ఆసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఏడుపాయల దుర్గాదేవి సీనియర్ ఆసిస్టెంట్ అచ్చన్నపల్లి శ్రీనివాస్‌గౌడ్, గ్రామ పెద్దలు సమక్షంలో జాతర ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. తునికి గ్రామం నుంచి బాజాభజంత్రీల మధ్య భక్తులు బండారు (బొట్టు పసుపు) తీసుకోచ్చి అమ్మ వారికి సమర్పించి, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో అమ్మ వారికి ఆలయ ప్రధాన పూజారి శివప్ప చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేశారు. నేడు శుక్రవారం అగ్నిగుండాలు, బోనాలు ఉంటాయని ఈఓ తెలిపారు. వేసవి వేడిమి తీవ్రత అధికంగా ఉండటంతో జాతరలో భక్తులకు ఏలాంటి ఆసౌకర్యాలు కల్గకుండా ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకోగా, భక్తులకు కోసం చిరు వ్యాపారులు ఆట వస్తువులు, తిను బండారు దుకాణాలు ఒక్కటి ఒక్కటిగా వెసుకొవడం జరుగుతంది. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి సమస్యలు రాకుండా, ముఖ్యంగా తాగునీటి సరఫరా చేయడానికి ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలయం పరిసరాలలో భక్తలు ఏర్పాట్లు చేసుకునే గుడారాల స్థలాలను, అటవీ ప్రాంతంను స్థానిక ఎస్సై రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టెబులు గస్తీ నిర్వహించి బందో బస్తీని ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఏలాంటి ఆనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకుగాను ముందు చూపుగా ఆలయ పరసరా ప్రాంతంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని సైతం అందుబాటులో ఉంచి, వైద్య సిబ్బంది తగు సేవలు అందించే విధంగా ఆలయ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి తగుచర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా దేవాలయాల సిబ్బంది మల్లికార్జున్ రెడ్డి, ఉత్సవ పాలక వర్గ సభ్యులు తాళ్ల శ్రీకాంత్ రెడ్డి, వడ్ల ప్రభాకర్ చారీ, తాళ్ల నారాయణ రెడ్డి, అంబూరి సునీత, రమావత్ మహేందర్, తలారి భిక్షపతి, చల్ల పర్వతాలుయాదవ్, కలాలి లక్ష్మినారాయణగౌడ్, హన్మోల్ల రాములు, తునికి గ్రామ



శ్రీ నల్ల పోచమ్మ తల్లిని గర్భాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


## దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు**

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి28 ప్రభాతవార్త:** తన ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం 5వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం సాయంత్రం తను ఇంట్లో ఉన్న సమయంలో బొజ్జ పవన్, జీవన్‌రావు, తాహెర్, పరశురాంగౌడ్, మ్యాకల నానిలతో పాటు సుమారు 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటి గేటును తన్నుతూ దుర్భాషలాడుతూ ఇంటిపై దాడి చేసి ఇంటి ముందు ధర్నా చేశారన్నారు. తనకు ప్రాణ హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బొడ్మట్‌పల్లి జిపిలో ఎలాంటి అవినీతికి తావులేదు

**- విచారణకు సిద్దం ..వేలంపాట డబ్బులు వాడుకున్నది నిజమే**



వేలం పాట డబ్బులు తీసుకొని పది నెలల తరువాత కట్టిన రశీదులు

**టేక్మాల్, మార్చి 28, ప్రభాతవార్త:** బొడ్మట్‌పల్లి గ్రామ పంచాయతీలో ఎలాంటి అవినీతి జరగలేదని అధికారుల సమగ్ర విచారణకు సిద్ధంగా ఉన్నామని బొడ్మట్‌పల్లి పాలకవర్గ సభ్యులు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈనెల 26న గ్రామసభలో జరిగిన రాద్ధాంతాలను వార్త కథనంతో తెర కెక్కించిన విషయం విధితమే. ఆ వార్తలో అవాస్తవమని, దానిని ఖండిస్తున్నట్లు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. గ్రామానికి చెందిన కొంత మంది యువకులు స్పందిస్తూ ఎలాంటి తప్పు చేయలేదని అంటున్నారు కాదా గ్రామంలో జరిగే అంగడి వేలం పాట డబ్బులు ఒక లక్ష 65 వేల రూపాయలను జిపి అకౌంట్‌లో జమ చేయకుండా 10 నెలలు ఎందుకు వాడుకున్నారు. అంటూ అదే వాట్సప్ గ్రుప్‌లో పోస్ట్ చేశారు. దీంతో సర్పంచ్ కుమారుడు అవును నిజమే వాడుకున్నది కాని అది మా సొంతానికి కాదు గ్రామాభివృద్ధికే అంటూ అని సమాధాన ఇచ్చారు. నిజంగా అవినీతి జరిగిఉంటే ఆధారాలతో వార్తలు రాయలన్నారు. పది నెలలు అంగడి డబ్బులు వాడుకున్న రశీదులు నిజమే అని ఒప్పుకోవడం ఎంటో అధికారులే చెప్పాలి. ఏది ఏమైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఈ గ్రామ పంచాయితీపై జరుగుతున్న ఆరోపణలు వాస్తవా అవాస్తలపై సమాగ్ర విచారణ చేయాలని గ్రామస్తులు కొరుతున్నారు.

# పెళ్లి కూతురిని తీసుకొస్తూ మృత్యు ఒడిలోకి...

**రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి**

**పెళ్లి ఆగిందని తాత ఆత్మహత్య**

**పాపన్నపేట, మార్చి 28 ప్రభాతవార్త :** వివాహ వేడుకల్లో ఆ ఇంట్లో శుభగడియలు గడవాల్సి ఉండగా రోడ్డు ప్రమాదంతో ఇంట్లో ఆశుభం చోటుచేసుకుంది. పెళ్లి కుమార్తెను తల్లిగారింటి నుంచి కళ్యాణ మండపానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మనవడి పెళ్లి ఆగిపోయిందని తాత ఆత్మహత్యచేసుకోవడంతో ఆ కుటుంబంలో కన్నీళ్లు మిగిలాయి. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండలంలోని బాచారం గ్రామానికి చెందిన సొంగ రమేష్‌కు సంగారెడ్డి జిల్లా అందోల్‌కు చెందిన మమతతో పెళ్లినిశ్చయమయింది. గురువారం పెద్దల సమక్షంలో వివాహవేడుకలను జరుపుకునేందుకు ఇరు కుటుంబాల వారు తగు ఏర్పాట్లు చేసుకున్నారు. పెళ్లి కుమార్తెను కళ్యాణ మండపానికి తీసుకొస్తున్న క్రమంలో అందోల్ మండలం మాన్‌సాన్‌పల్లి వద్ద బుధ వారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడగా పెళ్లి కుమారుడి బంధువులు ముగ్గురు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం తో వివాహ వేడుకలు ఆగిపోయాయి. పెళ్లి ఆగిపోవడంతో మనస్థాపానికి గురైన నరేష్ తాత పెంటయ్య గురువారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు.

**ఒకే రోజు నలుగురి అంత్యక్రియలు-గ్రామంలో విషాదం...**

ట్రాక్టర్ ప్రమాదంలో ముగ్గురు(ఆగమ్మ 42, బూదెమ్మ 52, జట్టిగారి సంగమ్మ 45), మృతి చెందడం, పెళ్లి ఆగిపోయిందని తాత పెంటయ్య (65) ఆత్మహత్య చేసుకోవడంతో గురువారం బాచారంలో నలుగురి అంత్యక్రియలు నిర్వహించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలను ఓదార్చడం ఎవరితరం కాలేకపోయింది. అంతక్రియల్లో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొని అశ్రునయనాలతో నలుగురికి తుది వీడ్కోలు పలికారు.

**అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే...**

**పాపన్నపేట, మార్చి 28, ప్రభాతవార్త:** పెళ్లి కుమార్తెను వివాహానికై కల్యాణ మండపానికి తీసుకువస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగం, పెళ్లి ఆగిపోయిందని పెళ్లి కుమారుడి తాత ఆత్మహత్య చేసుకోవడంలో మండలంలోని బాచారంలో విషాయ చాయలు అలుముకున్నాయి. రోడ్డు ప్రమాదంలో ఆగమ్మ, బూదెమ్మ, జట్టిగారి సంగమ్ములు కానరాని లోకాలకు చేరిపోవడం, వివాహం ఆగిపోయిందన్న అమస్థాపంలో పెళ్లి కుమారుడి తాత సొంగ పెంటయ్య ఆత్మహత్య చేసుకోవడంతో గురువారం నలుగురికి నిర్వహించిన అంతక్రియల్లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొని మృతులకు కన్నీటి వీడ్కోలు పలికారు. మృతుల కుటుంబాలను హన్మంతరావు పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు హన్మంతరావు ఆర్థిక సహాయం అందించి తానున్నానని భరోసా ఇచ్చారు. అంతక్రియల్లో మన్మంతరావుతో పాటు నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గోవింద్ నాయక్, ప్రభాకర్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

